# ఇస్కాన్ 'భోజనం' మహత్తరం: ఆనం

నెల్లూరు(సిటీ), న్యూస్‌లైన్ :

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఇస్కాన్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడం మహత్తర కార్యమని రాష్ట్ర సమాచార శాఖ మంత్రి రామనారాయణరెడ్డి కొనియాడారు. నెల్లూరులో పథకం అమలు చేసే బాధ్యతను ఇస్కాన్ సంస్థ చేపట్టడం గొప్ప విషయంగా అభివర్ణించారు. శుక్రవారం భక్తవత్సల నగర్‌లో ఇస్కాన్ సంస్థ నిర్మించిన కేంద్రీయ వంటగదిని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎనిమిదో తరగతి విద్యార్థుల వరకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో భోజనం పెడుతున్నామని, 9,10 తరగతుల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం పథకంలో చేర్చిందన్నారు. మంచి భోజనంతో పాటు విద్యార్థులకు శుద్ధిచేసిన తాగునీటిని అందించేందుకు కూడా ప్రయత్నం చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇందుకు బైర్రాజు ఫౌండేషన్, నంది ఫౌండేషన్ వంటి స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకుంటున్నట్లు చెప్పారు. నగరంలోని ప్రజలకు నామమాత్రపు ధరతో మినరల్ వాటర్‌ను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ రాంగోపాల్ మాట్లాడుతూ రూ.40 లక్షల వ్యయాన్ని వెచ్చించి ఇస్కాన్ మధ్యాహ్న భోజన పథకం అమలు బాధ్యలను చేపట్టడం అభినందనీయమన్నారు. నెల్లూరు శాసనసభ్యుడు ఆనం వివేకానందరెడ్డి మాట్లాడుతూ నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 45వేల మంది విద్యార్థులకు అవసరమైన ప్లేట్లు, గ్లాసులను పంపిణీ చేస్తామని ప్రకటి ంచారు. ఇస్కాన్ సంస్థ విద్యార్థులకు పెట్టే భోజనాన్ని 41 పాఠశాలల్లోని 14వేల మంది చిన్ని కృష్ణులకు అందించే ప్రసాదంగా ఆయన అభివర్ణించారు. ఇస్కాన్ ట్రస్టీ రాధాకృష్ణదాస్ మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 50 వంట కేంద్రాల ద్వారా 5 లక్షల మంది విద్యార్థులకు భోజనాన్ని అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే తిరుపతిలో పథకాన్ని అమలు చేస్తుండగా, మన జిల్లాలో రెండో కేంద్రాన్ని నెలకొల్పామన్నారు. నెల్లూరు ఇస్కాన్ అధ్యక్షుడు సుఖ్‌దేవ్‌స్వామి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి జలీల్‌సాహెబ్, నెల్లూరు ఆర్డీఓ వేణుగోపాల్‌రెడ్డి, కార్పోరేటర్లు ఆనం జయకుమార్‌రెడ్డి, వేల్పుల రజనీ తదితరులు పాల్గొన్నారు.

**మధ్యాహ్న భోజన పథకాన్ని 'ఇస్కాన్' చేపట్టింది. ఇక నగరంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందుతుంది.**



వంట గదిని ప్రారంభిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కలెక్టర్ రాంగోపాల్, సుఖదేవ్‌స్వామి